క్లుప్తంగా

కణేకల్లు ఎంపీపీగా యు.లీలావతి



కణేకల్లు: కణేకల్లు ఎంపీపీ-1 యు.లీలావతి ఎంపీపీగా ఎంపికయ్యారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ సి.ఓబుళమ్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 19న ఎంపీపీ సంధ్య వ్యక్తిగత కారణాలతో ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఎంపీపీ పదవి ఖాళీగా ఉంది. కలెక్టర్ ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ-1 లీలావతిని ఎంపీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు తెలిపారు. కొత్త ఎంపీపీ నియామకం అయ్యే వరకు లీలావతియే ఎంపీపీగా కొనసాగనుందని ఎంపీడీఓ తెలిపారు. ఎంపీపీగా లీలావతి నియామకం కావడంపై జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, పైనేటి తిమ్మప్పచౌదరి, కణేకల్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా వచ్చే వారంలో ఈమె ఎంపీపీగా బాధ్యతలను స్వీకరించనున్నట్లు తెలిసింది.

నాణ్యత లోపించకూడదు

కూడేరు: కూడేరులోని జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం సమీపంలో కోఆపరేటివ్ బ్యాంక్ తరఫున సుమారు రూ.82 లక్షలతో వ్యవసాయ గోదాము నిర్మిస్తున్నారు. శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ చౌదరి గోదాము నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణపు పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకూడదని కాంట్రాక్టర్‌కు ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెయ్యి మెట్రిక్ టన్నులను నిల్వ ఉంచే సామర్థ్యంతో ఈ గోదాము నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బీమా చెక్కుల అందజేత



రాధాబాయికి చెక్కు అందిస్తున్న ఉరవకొండ డీఎం బాలాజీ దయాళ్

ఉరవకొండ: ఉరవకొండ ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తూ మృతి చెందిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్-3 ఆర్‌వీకే రావు కుటుంబానికి ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద మంజూరయిన రూ.700100 చెక్కును డీఎం బాలాజీ దయాళ్ అందించారు. శుక్రవారం స్థానికి డిపో కార్యాలయంలో బాధితురాలు రాధాబాయికి చెక్కును అందించారు. అదేవిధంగా హెచ్‌ఎన్ స్వామి (కండక్టర్) కుటుంబానికి రూ.5,66,889, డీటీ స్వామి (డ్రైవర్) కుటుంబాలకు రూ. 2,89,000 మంజూరయ్యింది. కార్యక్రమంలో హెడ్‌క్లర్క్ రవి, సీనియర్ అసిస్టెంట్ కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన అవసరం

కళ్యాణదుర్గం రూరల్: బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బాలికల హాస్టల్‌లో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ చదువుకోవాల్సిన వయస్సులో వివాహం చేయడం ద్వారా ఎన్నో అనర్థాలు ఉంటాయన్నారు. చిన్న వయస్సులో వివాహం చేసుకుంటే ప్రసవ సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. బాలికలు ఉన్నతంగా చదువుకొని, బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ దామోదర్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్లు, ఐసీడీసీ సూపర్‌వైజర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్వరాన్ని నిర్లక్ష్యం చేయరాదు



నిల్వ ఉన్న నీటిలో లార్వాను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు

కూడేరు: జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దని, రక్త పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలని జిల్లా మలేరియా నివారణాధికారి ఓబులు ప్రజలకు సూచించారు. శుక్రవారం ఆయన కూడేరులోని పలు వీధుల్లో పర్యటించి, ఇళ్ల పరిసరాలు, పాత్రల్లో నీటి నిల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్ల వద్ద తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిలో లార్వా ఉండటాన్ని గుర్తించారు. ఆ నీటిని కిందికి పారబోయించారు. ఎక్కువ రోజులు డ్రమ్ములు, తొట్టెలు, ఇతర పాత్రలలో నీరు నిల్వ ఉంచుకోవద్దని ఆయన ప్రజకులకు సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలియజేశారు. సాయంత్రం వేళ ఇళ్ల పరిసరాల్లో వేపాకు పొగ పెడితే దోమలు దరి చేరవన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సూపర్ వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ రమేష్ , ఏఎన్‌ఎం చంద్రకళ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వందశాతం వంచన



కూటమి నేతలు ఎన్నికల సమయంలో అంతన్నారు.. ఇంతన్నారు.. అధికారంలోకి రావడమే తరువాయి అన్నీ చేస్తామని అలవిగాని హామీలిచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి వంద రోజులు పూర్తయినా ఏ ఒక్కటీ అమలు చేయలేదు. రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఉరవకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ గెలిపొంది ఎంతో కీలకశాఖ అయిన ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. సొంత నియోజకవర్గంలో సమస్యలు పేరుకుపోయినా కనీసం పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో వందరోజుల పాలన వంచనే అవుతోందని ఓట్లేసి గద్దెనెక్కించిన ప్రజలే బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

– ఉరవకొండ:

- మంత్రి కేశవ్ హామీలు నీటిమూటలే
- వంద రోజుల పాలనలో ఏ ఒక్కటీ అమలు కాని వైనం
- ఉరవకొండలో కలగా మారిన స్పిన్నింగ్ మిల్, టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు
- జీబీసీ, హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు హుళక్కేనా?

ఉరవకొండ నియోజకవర్గ ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గ రూపురేఖలు మారుస్తామంటూ ఎన్నికల ప్రచారంలో పయ్యావుల కేశవ్ ఆర్భాటంగా హామీలిచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలో రాగానే ఐదేళ్లలో ఉరవకొండ సమగ్ర అభివృద్ధి కోసం ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని కరపత్రాలు వేయించి, ప్రచారం చేశారు. ఉరవకొండ నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు పెంచడానికి స్పిన్నింగ్ మిల్లు, టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు.



ఉరవకొండ ఎన్నికల ప్రచారంలో చేనేతల హామీల కరపత్రాలు పంపిణీ చేస్తున్న పయ్యావుల కేశవ్ (ఫైల్)

చేనేత రుణమాఫీ అమలేదీ?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ధర్మవరం తర్వాత అత్యధికంగా చేనేత పరిశ్రమపై ఆధారపడి ఉరవకొండలో నివసిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం ద్వారా 5,274 మంది కార్మికులకు రూ.12.67 కోట్లు అందించారు. నేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేనేత రుణమాఫీ చేస్తామని ప్రకటించి, ఇప్పటి వరకూ ప్రభుత్వం విధివిధానాలు కూడా ప్రకటించలేదు.

వ్యవసాయ అనుబంధ పరిశ్రమ ఎప్పుడో?:

నియోజకవర్గ వ్యాప్తంగా 52,972 మంది రైతులు వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తున్నారు. ఉరవకొండ నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా హెచ్చెల్సీ, జీబీసీ, హంద్రీనీవా కింద ఆయకట్టుపై ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. వీరికి వ్యవసాయ అనుబంధ పరిశ్రమ తీసుకొచ్చి వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మారుస్తామని ఎన్నికల ప్రచారంలో మంత్రి కేశవ్ ఇచ్చిన హామీ నెరవేర్చాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ముస్లింల షాదీఖానా నిర్మించండి సారూ..:

ఉరవకొండ పట్టణంలో అత్యధికంగా ఉన్న మైనార్టీలకు ఎన్నికల ప్రచారంలో మంత్రి కేశవ్ ఎన్నో హామీలు ఇచ్చారు. ఇందులో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే షాదీఖానా పూర్తి చేస్తామని, దీంతో పాటు ముస్లిం, మైనార్టీల సమస్యలు, సందేహాలు నివృత్తి చేయడానికి 24 గంటల్లో పనిచేసే ఒక ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందేనా?



ఆయకట్టు కింద పంట సాగుచేస్తున్న రైతు

ఎన్నికల ప్రచారంలో మంత్రి కేశవ్ జీబీసీ, హెచ్చెల్సీ ఆధునీకరణ పనులు చేపట్టి చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉరవకొండ నియోజకవర్గానికి హెచ్చెల్సీతో పాటు జీబీసీ కింద ఆయకట్టు సాగు అవుతుంది. హెచ్చెల్సీ పరిధిలో 15వేల ఎకరాలు, జీబీసీ పరిధిలో 15, 500 ఎకరాలు ఆయకట్టు ఉంది. జీబీసీ కాలువ ఆధునికీకరణ పనులు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నిలిచిపోయాయి. అప్పటి కాంట్రాక్టు సంస్థలు పనులు సరిగా చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం 63 కిలోమీటర్ల ఆధునికీకరణ పనులు జరగాల్సి ఉంది. దీంతో పాటు హెచ్చెల్సీ ఆధునీకరణ పనులు కూడా ప్రారంభించాలి.



ఉరవకొండలో తాగునీటి కోసం అవస్థలు పడుతున్న మహిళలు

ఉరవకొండ ప్రజలకు క'న్నీటి' కష్టాలు..

జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఉరవకొండలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. పట్టణంలోని 50 వేల జనాభాకు తగ్గట్టుగా నీరు సరఫరా కావడంలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి ఎద్దడిని తీర్చడానికి ఫిల్టర్ ట్యాంకులు ఏర్పాటు చేయడమే కాకుండా జేజేఎం ద్వారా ఇంటింటికీ కుళాయి పథకాన్ని సమర్థవంతంగా చేపట్టారు. దీంతో పాటు ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణానికి టెండర్లు కూడా ఆహ్వానించారు. ఉరవకొండకు శాశ్వతంగా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పరిష్కరిస్తామని ఎన్నికల ప్రచారంలో మంత్రి కేశవ్ ఇంటింటికీ వెళ్లి భరోసా కల్పించారు. ఇప్పటికైనా తాగునీటి సమస్యను మొదటి ప్రాధాన్యతగా పరిష్కరించాలని మంత్రిని ప్రజలు కోరుతున్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి



ఉరవకొండ పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించి ఉదిపికొండ నుంచి ఉరవకొండకు ప్రత్యేక పైప్‌లైన్ వేయించేలా చర్యలు తీసుకోవాలి. ఇంటింటికీ కుళాయి పథకాన్ని పూర్తి చేయాలి. పట్టణంలోని మరిన్ని ఫిల్టర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలి. నీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితిని తప్పించాలి.

– ఓబుళమ్మ, ఉరవకొండ

జీబీసీ, హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపట్టాలి




ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి పయ్యావుల కేశవ్ జీబీసీ, హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి. ముఖ్యంగా రైతులు చివరి ఆయకట్టుకు నీరు అందక పంటలు కోల్పోవాల్సి వస్తోంది. ఆధునికీకరణ పనులు చేపట్టడానికి నిధులు మంజూరు చేయించి, పనులు వెంటనే ప్రారంభించాలి. – రంగారెడ్డి, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉరవకొండ

పరిశ్రమలు తేవాలి



ఉరవకొండ నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే నెరవేరుస్తామన్నవి పూర్తి చేయాలి. నియోజకవర్గంలో ప్రత్యేకంగా పరిశ్రమలు మంజూరు చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అత్యధిక మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి మంత్రి కేశవ్ ప్రత్యేక చొరవ చూపాలి. – సిద్దార్థ్, ఎస్‌ఎఫ్ఐ, జిల్లా అధ్యక్షుడు, ఉరవకొండ

చంద్రబాబు పాలన వంచనే..



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులైనా ప్రజలకు ఒరిగిందేమీ లేదు. సూపర్‌సిక్స్ వాగ్దానాలు మరిచి వంచనతో పాలన సాగిస్తున్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఉరవకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులెత్తించాం. ప్రస్తుతం నియోజకవర్గానికి మంత్రి కేశవ్ ఎన్నో హామీలు ఇచ్చారు. ప్రజలు వాటిని నమ్మి ఓట్లేసినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. మంత్రి కేశవ్ ఇచ్చిన హామీలు అమలు చేసి, చిత్తశుద్ధిని చాటుకోవాలి.

– వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ప్రజా వేదికలో మంత్రికి వినతుల వెల్లువ

బెళుగుప్ప: మండలంలోని బి.రామసాగరంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదికలో వినతులు వెల్లువలా అందాయి. సర్పంచ్ రామకృష్ణమ్మ అధ్యక్షతన ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించారు. మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరయ్యారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారిగా మంత్రి పయ్యావుల మండలంలో పర్యటించారు. దీంతో ప్రజల నుంచి వినతులు వెల్లువలా వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావేదిక ద్వారా సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరిస్కారానికి కృషి చేస్తున్నామన్నారు. 90 శాతంతో డ్రిప్ పరికరాలను పదెకరాలకు వర్తింపజేయాలని, నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘానికి కమ్యూనిటీ హాల్, మోడల్ స్కూల్, రైతులకు శీతల గిడ్డంగి, పింఛన్లు, క్రీడా ప్రాంగణం మంజూరు చేయాలని విన్నవించారు.



వినతులు స్వీకరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, చిత్రంలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిళ, డీఎల్‌డీఓ శంకర్‌రావ్, ఈఓఆర్డీ మాధవ్‌రెడ్డి, డీటీ హుస్సేన్ పీరా, ఏడీ యల్లప్ప, ఏఓ పృథ్వీసాగర్ సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలో విజయవాడ వరద బాధితులకోసం విరివిగా విరాళాలు సేకరించారు. ఈ విరాళాల చెక్కును రామసాగరంలో కలెక్టర్ వినోద్ కుమార్, మంత్రి పయ్యావుల కేశవ్‌కు శుక్రవారం అందించారు. గొల్లలదొడ్డి ప్రాథమిక పాఠశాల రూ.5000, శ్రీనివాస విద్యానికేతన్ రూ.1,87,200, సన్‌రైజస్ పాఠశాల రూ.65,500, బెళుగుప్ప స్వాన్స్ స్వచ్ఛంద సంస్థ రూ.65,000, నిస్వార్థ ఫౌండేషన్ రూ.82,486 చొప్పున చెక్కులను ఎంఈఓ మల్లారెడ్డితో కలిసి మంత్రి, కలెక్టర్‌కు అందించారు.

నిస్వార్థ స్వచ్ఛంద సంస్థ విరాళం అందజేత

ఉరవకొండ: వరద బాధితుల కోసం సేకరించిన విరాళాల చెక్కును మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్‌కు శుక్రవారం అందించారు. నిస్వార్థ స్వచ్ఛంద సంస్థ రూ.34,355, ఉరవకొండ ప్రజలు సేకరించిన రూ.48,031 చెక్కులను రామసాగరంలో మంత్రి, కలెక్టర్‌కు అందించారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బ్రహ్మసముద్రం : క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని మండల విద్యాధికారి ఓబుళపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో అండర్- 14, అండర్- 17 , బాలికల క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, పీఈటీ ఇబ్రహీం , తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డ్రైడే పాటించండి

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు పీహెచ్‌సీ పరిధిలోని శుక్రవారం బీసీ, ఎస్సీ కాలనీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణకుమారి ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడేపై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఏఎన్‌ఎం శ్రావణి, అనిత, ఆశా వర్కర్లు, శాంతి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

కంబదూరు: మండలంలోని చెర్లోపల్లిలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న వెంకటేశులును పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి 47 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ రవిప్రసాద్, హోంగార్డు రవికుమార్ తదితరులు ఉన్నారు.

రూరల్ సర్కిల్ సీఐగా నీలకంఠేశ్వర్

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ సీఐగా నీలకంఠేశ్వర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ బదిలీపై వెళ్లడంతో అనంతపురం ఇంటిలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న నీలకంఠేశ్వర్ ఇక్కడికి వచ్చారు.

నేడు ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు

రాయదుర్గం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు రాయదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ప్రారంభిస్తామని ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ శివశరణ, పీఈటీ కరియప్ప తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో బాలురు, బాలికలు పాల్గొంటారన్నారు. అండర్-14, అండర్-17 క్రీడలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంఈఓ-1, ఎంఈఓ-2 నాగమణి, వెంకటరమేష్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు జరుగుతాయన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళాకు స్పందన



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్ మేళాలో 81 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభించాయి. జాబ్‌మేళాలో ఎయిర్‌టెల్ పేమెంట్స్, అమర్ రాజా బ్యాటరీస్, వికాస్, డీఎస్సీ, రిలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మొత్తం 5 కంపెనీల జాబ్ మేళాకు 150 మంది నిరుద్యోగులు హాజరైనట్లు ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ సోమ్లానాయక్ తెలిపారు. ఇంటర్వ్యూల అనంతర 5 కంపెనీల్లో 81 మందిని వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, డీఆర్‌డీఏ కోఆర్డినేటర్ ఓబులేష్, ఏపీ ఎస్‌డీసీ కోఆర్డినేటర్ రాము, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హర్ష, ఎస్‌టీసీ ఆలిషాకలాం తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ మేళా

ఉరవకొండ: చిన్నముష్టూరు సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్, డీఆర్‌డీఏల ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ కె.అష్రాఫ్‌అలీ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ అపోలో ఫార్మసీ, వికాస్, డీఎస్సీ లాంటి ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు పొందేందుకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ మేళాకు 92 మంది అభ్యర్థులు హాజరుకాగా, 40 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

బొమ్మనహాళ్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ షకీలాబేగం అన్నారు. శుక్రవారం మండలంలోని పంచాయతీ కేంద్రాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరుతో ఒక మొక్క నాటడం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో అధికారులు, సర్పంచులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అధికారులు అన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ దాస్, నేమకల్లు సర్పంచ్ పరమేశ్వర తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

కూడేరు: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని, జీవకోటికి ప్రాణవాయువు అందించే పచ్చని చెట్లను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నాగభూషణరెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కూడేరులో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంత రెడ్డి, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఏపీఓ తులసీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

ఉరవకొండ: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మీనుగ లలితమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి సర్పంచ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ చంద్రమౌళి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

వజ్రకరూరు: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సర్పంచు మల్లెల జగదీష్ అన్నారు. శుక్రవారం వజ్రకరూరు, చాబాల గ్రామంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్రప్ప, పీడీ లక్ష్మిప్రసాద్, ఉపాధ్యాయులు,గ్రామకార్యదర్శి శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ బోల్తా

కళ్యాణదుర్గం రూరల్: రాయదుర్గం ప్రాంతం నుంచి బెంగళూరుకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ కళ్యాణదుర్గం సమీపంలోని బళ్లారి రోడ్డు వద్ద బోల్తాపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. లారీ బోల్తా పడటంతో డ్రైవర్‌కు, క్లీనర్ గాయపడ్డారు. ఘటన జరిగిన గంట వ్యవధిలోనే లారీని అక్కడి నుంచి తొలగించారు. దీనిపై సీఐ వెంకటరమణను అడగ్గా ఇసుక లారీ బోల్తా పడిన విషయం మాకు తెలియదన్నారు.

దళిత మహిళపై దాడి తగదు

శెట్టూరు: కర్నూలు జిల్లా కల్లుకుంటలో గోవిందమ్మ అనే దళిత మహిళపై దాడి చేసిన వారిని శిక్షించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు టైగర్ వన్నూరుస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని చింతర్లపల్లిలోని దళిత కాలనీలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష్మణమూర్తి, మల్లెల నారాయణ, జెన్ని సురేష్, మాజీ సర్పంచ్ బాబురావు, సీనియర్ నాయకులు వన్నూరప్ప, శివన్న తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రాయదుర్గంకు సహకరించాలి



31వ వార్డులో చెత్తను శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప, కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: స్వచ్ఛ రాయదుర్గం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని 31వ వార్డు శాంతి నగర్ బన్ని మహంకాళి ఏరియాలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని అమలు చేశారు. కార్యక్రమంలో భాగంగా చైర్‌పర్సన్ తోపాటు కౌన్సిలర్లు చీపురు చేతబట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఆమె మాట్లాడుతూ గాంధీ జయంతి అక్టోబర్ 2 వరకు రాయదుర్గంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం జరుగుతుందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త రహిత సమాజంగా తీర్చిదిద్దాలని, చెత్తను కాలువల్లో పారవేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు. తడి,పొడి చెత్తలను వేర్వేరుగా అందించాలన్నారు. కౌన్సిలర్లు జ్యోతి, పొరాళ్ల గోవిందరాజులు, గౌని లావణ్య, కోఆప్షన్ సభ్యుడు నజీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రయాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జెండా మోసిన కార్యకర్తలకు అన్యాయం



ఏఓ ఆంజనేయులతో మాట్లాడుతున్న తెలుగుయువత నాయకులు

కంబదూరు: కూటమి అధికారంలోకి రావడానికి అహర్నిశలు కష్టపడి పని చేశాం..జెండాలు మోసాం..చివరికి పార్టీ ఆఫీసులోకి టీలు కూడా మోసాం.. అధికారంలోకొచ్చాక మండల నాయకులు మమ్మల్ని విస్మరించారని టీడీపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మంజూరైన మినీ గోకులాల షెడ్ల మంజూరులో మండల నాయకులు తమకు మంజూరు కాన్వికుండా ఒక వర్గానికే మంజూరు చేయించారన్నారు. వీటిని మంజూరు కాకుండా ఆపాలని తెలుగుయువత నాయకులు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి శుక్రవారం వెళ్లి ఏఓ ఆంజనేయులు, ఏపీఓ ఉస్మాన్ ఆలీలను కోరారు. మాకు జరుగుతున్న అన్యాయంపై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు.

ఆధ్యాత్మిక శక్తితోనే జీవితాల్లో వెలుగు



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం నాయక్

వజ్రకరూరు: ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకున్నప్పుడే జీవితాల్లో వెలుగులు నిండుతాయని గిరిజనులకు బంజారా సంఘం ప్రతినిధి సుబ్రహ్మణ్యం నాయక్ సూచించారు. వజ్రకరూరు మండలం రూపా నాయక్ తండాలో జరుగుతున్న హర్యాలీతీజ్ వేడుకల్లో శుక్రవారం ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. వేడుకలకు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తల్లి బండారు లీలావతి హాజరయ్యారు. అంతకుముందు గ్రామంలోని సామాసంగ్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంజారా సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్‌కే కేశవనాయక్, మాజీ జెడ్పీటీసీ తులసీదాస్ నాయక్, పాల్గొన్నారు.

నగరవనం పరిసరాల్లో ఎలుగుబండ్ల

రాయదుర్గంటౌన్: పట్టణ శివారు బళ్లారి రోడ్డు నగరవనం వద్ద శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో రెండు ఎలుగుబండ్ల సంచారం కలకలం రేపింది. టెలి కమ్యూనికేషన్ సమస్య పరిష్కారం కోసం శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో నగరవనం సమీపంలో రైల్వే ట్రాక్‌పై సిబ్బంది పరిశీలిస్తుండగా ఎలుగుబంట్లు కనిపించాయి. భయపడిన సిబ్బంది టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థను సరిచేయకుండానే వెళ్లిపోయారు. ఎలుగుబండ్ల సంచారంతో సమీపంలో ఉండే గౌడ హౌసింగ్ లేఅవుట్ ప్రజలు, నగరవనానికి వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రైల్వే సిబ్బంది ఎలుగుబంట్లు చూసిన విషయం స్టేషన్‌మాస్టర్ ద్వారా మీడియాకు తెలిసింది.

ఘనంగా గవిమఠం పీఠాధిపతుల జన్మదిన వేడుకలు



గవిమఠం పీఠాధిపతుల జన్మదిన వేడుకల సందర్భంగా స్వామిని సత్కరిస్తున్న దృశ్యం

ఉరవకొండ: తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి వారి 97వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కర్ణాటకలోని టుంకూరు శాఖ మఠంలో పీఠాధిపతి జగద్గురు చెన్నబసవ రాజేంద్ర జన్మదినం సందర్భంగా స్వామికి భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం ఆదోని చౌకి మఠం పీఠాధిపతి కళ్యాణస్వామిజీ, గవిమఠం ఏజెంట్ రాజన్నగౌడ్‌తో పాటు మఠం సిబ్బంది స్వామికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.